www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 28 | ఏప్రిల్ | 2026
పేజీలు : 8

# జనగణనతో పలు ప్రయోజనాలు




**-డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క**

**ప్రజాపక్షం/ఖమ్మం :** జనగణనతో పలు పథకాల ద్వారా ప్రయోజనం పొందవచ్చునని ప్రతి కుటుంబం ఖచ్చితంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

మిగతా 2లో..

# సారూ.. ఈ రోడ్డును పట్టించుకోరా..?



- -గోతులమయంగా ఏన్కూరు ముచ్చర్ల రోడ్డు
- -తరచూ ప్రమాదాలు
- -అయినా పట్టించుకోని అధికారులు

2లో



-లీటర్ రూ.200ల చొప్పున కిరాణా, బెల్టు షాపుల్లో విక్రయాలు
-సిండికేట్‌గా మారిన బంకుల యాజమాన్యాలు



# బంకుల్లో నిల్.. బ్లాక్‌లో ఫుల్..!



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తుండగా, బ్లాక్ మార్కెట్‌లో మాత్రం పెట్రోల్, డీజిల్ ఏరులై పారుతోంది. అగ్రదేశాల మధ్య యుద్ధాన్ని సాకుగా చూపి కృత్రిమ కొరత సృష్టిస్తున్న మాఫియా, ప్రజల అవసరాన్ని సొమ్ము చేసుకుంటోందని వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని పలు మండలాలు, పట్టణాల్లో బంకుల ముందు వాహనాలు బారులు తీరినా చుక్క పెట్రోల్ దొరకని పరిస్థితి.

మిగతా 2లో..

- -పెట్రోల్, డీజిల్ కొరతను నివారిస్తాం
- -స్వీయగణనను వినియోగించుకోండి
- -కలెక్టర్ దివాకర టిఎస్

# విద్యా వైద్యం, సంక్షేమంపై ప్రధాన దృష్టి



**ప్రజాపక్షం/ఖమ్మం :** విద్య, వైద్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రధాన దృష్టి సారి స్తున్నట్లు ఖమ్మం కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సంక్షేమ, ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలయ్యేలా చూస్తామని ఆయన తెలిపారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన తర్వాత కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని వాటిని సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 2027 జనగణన ప్రారంభమైందని తొలుత స్వీయగణన ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 26 నుంచి మే 10 వరకు స్వీయ గణన ఉంటుందని ప్రత్యేక యాప్ ద్వారా కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చునన్నారు. కుటుంబ యజమాని సంబంధిత

మిగతా 2లో..

- -గ్రామస్థాయికి శాస్త్రవేత్తలు
- -రఘునాథపాలెంను ఆదర్శంగా నిలపాలి
- -రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో మంత్రి తుమ్మల

# ఆధునిక వ్యవసాయంతో రైతులకు ఆదాయం



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఆధునీక వ్యవసాయంతో రైతులకు అధిక ఆదాయం సాధ్యమవుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన రఘునాథపాలెం రైతు వేదికలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి మొదటి కార్యక్రమంగా రైతుల కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రైతులకు ఆధునీక వ్యవసాయ పద్ధతుల ప్రయోజనం అందించేందుకు శాస్త్రవేత్తలు గ్రామస్థాయికి వెళ్లేలా ఈ కార్యక్రమాన్ని

మిగతా 2లో..

# బంకుల్లో నిల్.. బ్లాక్‌లో ఫుల్..!

(మొదటిపేజీ తరువాయి)
కానీ అదే సమయంలో కిరాణా షాపులు, బెల్టు షాపుల్లో లీటర్ పెట్రోల్, డీజిల్ రూ.200/ చొప్పున యథేచ్ఛగా విక్రయిస్తున్నారని వాహనదారులు మండిపడుతున్నారు.సిండికేట్ దందా ఆరోపణలు పెట్రోల్ బంకుల యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి ఈరోజు నువ్వు అమ్మితే రేపు నేను అమ్మాలి అనే ఒప్పందాలతో కృత్రిమ కొరత సృష్టిస్తున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిల్వలు ఉన్నప్పటికీ ద్విచక్ర వాహనాలకు కూడా పెట్రోల్ పోయని దుస్థితి నెలకొందని చిరు వ్యాపారులు వాపోతున్నారు. అర్ధరాత్రి డబ్బాల దందా అక్రమ వ్యాపారులు అర్ధరాత్రి నుంచే బంకుల వద్ద పడిగాపులు కాసి డబ్బాలకు డబ్బాలు నింపుకుంటున్నారని, తెల్లవారేసరికి బంకుల్లో నిల్వలు నిండుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో బ్లాక్ మార్కెట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

**కఠిన చర్యలు చేపట్టాలి...**

ఇంధన కొరత పేరుతో వాహనదారుల జేబులకు చిల్లులు పెడుతున్న అక్రమ వ్యాపారులపై, బ్లాక్ మార్కెట్‌కు ఇంధనం తరలిస్తున్న బంకుల యాజమాన్యాలపై అధికారులు తక్షణమే నిఘా పెంచాలని ప్రజలు



డిమాండ్ చేస్తున్నారు. సిండికేట్‌గా ఏర్పడి కృత్రిమ కొరత సృష్టిస్తున్న బంకుల లైసెన్సులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. నిత్యావసరమైన ఇంధనంతో జరుగుతున్న ఈ దోపిడీని అరికట్టకపోతే సామాన్యులపై మరింత భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఆధునిక వ్యవసాయంతో రైతులకు ఆదాయం

(మొదటిపేజీ తరువాయి)
నిర్వహిస్తున్నామన్నారు. రైతులు ఏ పంట సాగు చేయాలి, ఎంత ఎరువు వాడాలి, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ఎలా సాధించాలి వంటి ఆధునీక వ్యవసాయ సాంకేతికతలను తెలుసుకోవాలని సూచించారు. మే నెలలో గోద్రెజ్ ఆయిల్ పాం ఫ్యాక్టరీ ప్రారంభం కానుందని గోద్రెజ్ సంస్థ ఖమ్మంజిల్లాలో ఆయిల్ పాం నర్సరీని కూడా స్థాపించనుందన్నారు. గత పదేళ్లలో యాంత్రీకరణకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణకు నిధులు కేటాయించనుందన్నారు. రైతులు ఆయిల్ పాం సాగు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం నాలుగేళ్ల పాటు ఎకరానికి రూ. 51వేలు సబ్సిడీ అందిస్తుందని ఈ పంట 40 ఏళ్ల పాటు ఆదాయాన్ని అందిస్తుందన్నారు. అంతర పంటలుగా మిర్చి, పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, కూరగాయలు, వక్క, జాజి, కోకో వంటి పంటలు కూడా సాగు చేసుకోవచ్చునని తెలిపారు. శాస్త్రవేత్తలు అందించిన సలహాలు, సూచనలు పాటించి మంచి దిగుబడులు సాధించాలన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనే పరిస్థితి ఉందని దానికి అనుగుణంగా పంటల సాగు శాస్త్రవేత్తలు సూచించినవిధంగా చేపట్టాలన్నారు. రఘునాథపాలెం మండలానికి సాగునీటి కష్టాలను తీర్చేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా సాగర్ నీటిని చెరువులకు నింపినట్లు తెలిపారు. బుగ్గవాగు ప్రాజెక్టు ద్వారా కామేపల్లి, రఘునాథపాలెంలోని మిగిలిన ప్రాంతాలకు సాగునీటిని అందించేందుకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఆధునీక వ్యవసాయంలో రఘునాథపాలెం మండలాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలన్నారు. పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఆహార భద్రత చాలా కీలక అంశంగా మారనుందన్నారు. పెరుగుతున్న జనాభా, భూసారం తగ్గడం వంటి సమస్యలు కీలకం కానున్నాయన్నారు. సరైన పరిజ్ఞానంతో వ్యవసాయం చేయగలిగితే ఎకరానికి రెండు నుంచి మూడు లక్షలు సంపాదించే అవకాశం ఉందన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. మన వ్యవసాయ శాఖ మంత్రి స్వయంగా రైతేనని ఆయన పంట పొలాల్లో యూరియాను వినియోగించడం లేదని ఆర్గానిక్ ఫార్మింగ్ చేపడుతున్నారన్నారు. రసాయనాలతో పండించిన పంటలను తినడం వల్ల రోగాల భారీన పడుతున్నామన్నారు. ఆచార్య జయశంకర్, విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ జానయ్య మాట్లాడుతూ 2025లో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ప్రారంభించి 1200 గ్రామాల్లో 400 మంది శాస్త్రవేత్తలు, 400 మంది అధికారులు 1.20 లక్షల మంది రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ ఏడాది నెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించి 1600 గ్రామాల్లో 2.40 లక్షల మంది రైతులకు ఆధునీక వ్యవసాయంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అధిక రసాయనాల వాడకం వల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని క్యాన్సర్‌తో పాటు సంతానోత్పత్తికి సంబంధించిన రోగాల భారీన ప్రజలు పడుతున్నారన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అధికంగా రసాయనాలను వాడుతుందన్నారు. రైతులు సంప్రదాయ పంటలు కాకుండా పంటల మార్పిడి విధానాన్ని అవలంబించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు రామిరెడ్డి గోపాలరెడ్డి, ఖమ్మం డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా॥ పావని, శాస్త్రవేత్తలు, జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్, ఖమ్మం డివిజన్ ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు, సర్పంచ్ గాజుల కృష్ణారావు, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సొసైటీ మాజీ ఛైర్మన్లు తాతా రఘురాం, రావూరి సైదబాబు, వ్యవసాయ శాఖాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జనగణనతో పలు ప్రయోజనాలు

(మొదటిపేజీ తరువాయి) సోమవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో స్వీయగణన కార్యక్రమంలో ఆయన తన కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ జనగణన 2027 ప్రక్రియలో భాగంగా ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందెందుకు జనగణన తోడ్పాడుతుందన్నారు. జనగణనలో సమాచార సేకరణ సులభతరం అవుతుందని స్వీయగణనను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ హిమవర్ష తదితరులు పాల్గొన్నారు.

# సారూ.. ఈ రోడ్డును పట్టించుకోరా..?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అనేక ఏళ్లుగా గుంటలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బదులు పడుతున్న ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించకపోవడం శోచనీయం. ఖమ్మం జిల్లాలో రద్దీగా ఉండే రోడ్లలో ఏన్కూరు నుంచి తిమ్మారావుపేట మీదుగా ముచ్చర్ల వచ్చే రోడ్డు ఒకటి. ఏజెన్సీ గ్రామాలను కలుపుతూ వెళ్లే ఈ రోడ్డు నిరంతరం రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా మహబూబాబాద్ జిల్లాతోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను ఈ రోడ్డు కలుపుతుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ రోడ్డుపై ప్రమాదకర స్థాయిలో గుంటలు ఏర్పడ్డాయి. అయినా ఈ రోడ్డు పునర్నిర్మాణం పట్ల అధికారులు కనీస శ్రద్ధ కనర్చడం లేదు. ముఖ్యంగా అడవి మద్దులపల్లి సమీపంలో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లే పరిస్థితి లేదు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇంత కాలం నిర్లక్ష్యంగా వదిలి వేయడమే విచిత్రంగా ఉంది. ఇప్పటికైనా స్పందించి సత్వర మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



# విద్యా వైద్యం, సంక్షేమంపై ప్రధాన దృష్టి

(మొదటిపేజీ తరువాయి) ఫోన్ నెంబర్లు ఈ యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లయితే ఓటిపి వస్తుందని తెలియజేస్తూ సాంకేతికపరమైన విషయాలను కలెక్టర్ దివాకర మీడియాకు తెలియజేశారు. ఈ దఫా జనగణన డిజిటల్ మోడ్‌లో జరుగుతుందని ఆయన తెలిపారు. స్వీయగణన తర్వాత జనగణన కొరకు 800 మంది జనాభాను ఒక యూనిట్‌గా తీసుకుని వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. ఇందు కొరకు 2669 మందిని నియమించామని 485 మంది పర్యవేక్షకులను కూడా నియమించామన్నారు. జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి వీలైనన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని కొనుగోలు కేంద్రాల్లో గోనేసంచుల కొరత రాకుండా నివారిస్తామని ఇప్పటికే జిల్లా అవసరాలకు సరిపడ గోనేసంచులను దిగుమతి చేసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. రెండు రోజులుగా జిల్లాలో నెలకొన్న ఇంధన సమస్యపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ సోమవారం రాత్రికి 150 ట్యాంకర్లు జిల్లాకు రానున్నాయని మంగళవారం నాటికి సమస్య పరిష్కారం అవుతుందని డీజిల్ కొరతను నివారిస్తామని తెలిపారు. రైతులకు ముఖ్యంగా హార్వెస్టర్లు, ట్రాక్టర్లు, కొనుగోలు కేంద్రాల నుంచి ఎగుమతి చేసే వాహనాలకు, అంబులెన్స్‌లకు డీజిల్ కొరత రానివ్వబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# మొక్కజొన్న కంకులు దగ్ధం

**ప్రజాపక్షం/కొణిజర్ల :** కొణిజర్లలో గుర్తుతెలియన వ్యక్తులు మొక్కజొన్న దంటుకు నిప్పుపెట్టడంతో మంటలు ఎగిసిపడి పొలాల్లో ఉన్న మొక్కజొన్న కంకులు దగ్ధమయ్యాయి. కొణిజర్లకు చెందిన కొమ్మిన్ని సుధాకర్‌కు చెందిన 25 క్వింటాళ్ల కంకులు, సామినేని అనంతరాములుకు చెందిన 25 క్వింటాళ్ల కంకులు, ఒడ్డు రాములుకు చెందిన 20 క్వింటాళ్ల కంకులు కాలిపోయాయి. దీంతోపాటు పొలాల్లో ఉన్న మోటార్ పైపులు, సాగునీరు సరఫరాచేసే పైపులు కాలిపోయాయి. ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేశారు.



# పెట్రోల్ బంక్ యజమాని నిర్లక్ష్యం..
## వాహన దారుడికి బలమైన గాయం

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** పెట్రోల్ బంక్ యజమాని నిర్లక్ష్యనికి ఓ వాహనదారుడు కి త్రుటిలో ప్రాణాపాయం తప్పగా తీవ్ర బలమైన గాయమైన సంఘటన చోటు చేసుకుంది స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని బీరోలు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ యజమాని పెట్రోల్ కొరత ఉన్నట్లు నో స్టాక్ బోర్డు పెట్టకుండా బంకుకి వచ్చే వాహనాలకి అడ్డంగా సన్నటి కంటికి కనపడని జీ వైర్ కట్టడంతో బచ్చోడు గ్రామానికి చెందిన నందిపాటి ఉపేందర్ ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో దమ్మాయిగూడెం నుండి బచ్చోడు వెళ్తుండగా పెట్రోల్ కోసమని వాహనదారుడు ఒక్కసారిగా బంకులోకి తొలగడంతో గొంతుకు జీ వైర్ తలగి బలమైన గాయం అయింది వెంటనే గాయపడ్డ ఉపేందర్ ను చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. రోడ్డుకి బంకుకి అడ్డంగా జీ వైర్ కట్టిన పెట్రోల్ బంక్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకొని బంకు లైసెన్స్ ను రద్దుచేసి సంబంధిత బాధితుడుకు న్యాయం చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితులకు సంబంధించిన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.



# ఆదర్శ కమ్యూనిస్టు చింతలపూడి కృష్ణయ్య
## -సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తుది శ్వాస వరకు నమ్మిన సిద్ధాంతం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జెండాను బట్టి పార్టీ ఎదురుదెలకు ఎంతో కృషి చేసిన కామ్రేడ్ చింతలపూడి కృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందడం సిపిఐ పార్టీకి తీరంలోని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. మండల పరిధిలోని ఎర్రగడ్డ గ్రామంలో చింతలపూడి కృష్ణయ్య సంతాప సభలో సిపిఐ జిల్లా నాయకులు పాల్గొని కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగం హేమంతరావు మాట్లాడుతూ, నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు చింతలపూడి కృష్ణయ్య, సిపిఐ పార్టీ ఎదుగుదలకు కృషి చేశారని పేద ప్రజల సమస్యల కోసం ఎన్నో పోరాటాలు చేశారని ఆయన అన్నారు. చింతలపూడి కృష్ణయ్య, ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర రైతు సమితి సభ్యులు మహమ్మద్ మౌలానా, ఆంధ్రప్రదేశ్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు దంతాల బాలరాజు, సిపిఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాపక్షం/పెనుబల్లి:** భారత రాష్ట్ర సమితి 26 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని అడవి మల్లేల గ్రామం లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, భారత రాష్ట్ర సమితి నాయకులు మందడపు అశోక్ కుమార్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం భారత రాష్ట్ర సమితి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తాత మధుసూదన్ సహకారంతో గ్రామంలోని ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కనగాల వెంకటరావు, పెనుబల్లి మాజీ సర్పంచ్ తేజావత్ తావూ నాయక్, గ్రామ నాయకులు బానావత్ బాబలా, మూడు వెంకటేశ్వరరావు, పులపాక వెంకటేష్, ధర్మసోత్ రమేష్, తేళ్ల శ్రీనివాసరావు, పులపాక రవి, మలావత్ ప్రేమ్ కుమార్, జొన్నలగడ్డ కోటేశ్వరరావు, మూడు నరసింహారావు, వాంకుడోత్ నాగేశ్వరరావు, మాలావత్ శ్రీకాంత్, కొంగల పార్వతి, మూడు తులసమ్మ, మారబోయిన లక్ష్మి పాల్గొన్నారు.



# భానుడి భగ భగ..!

**ప్రజాపక్షం/కల్లూరు:** మండల వ్యాప్తంగా ఆదివారం మండే ఎండలకు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించాడు. నిప్పుల కొలిమి తలపించేలా 40 డిగ్రీల ఉష్ణోగ్రత మండలంలో నమోదు కావడంతో రహదారులు వ్యాపార సముదాయాలు నిర్మాణస్యంగా మండలంలో మారాయి. రానున్న వారం రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలియజేస్తుంది. ఎండల తగ్గే వరకు కూడా ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

**-పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన కూరాకుల**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని డిసిసిబి మాజీ అధ్యక్షులు కూరాకుల నాగభూషణం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావమే లక్ష్యంగా ఏర్పడిన బిఆర్ఎస్ కేసిఆర్ నేతృత్వంలో రాష్ట్రాన్ని సాధించడంతో పాటు దశాబ్ద కాలం పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నిలిపిందన్నారు. పలు సంక్షేమ పథకాలతో తెలంగాణ ప్రజలు లబ్ది పొందారని బిఆర్ఎస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ కబంధ హస్తాల్లో తెలంగాణ చిక్కుకుందని తెలంగాణను కాంగ్రెస్ నుంచి విముక్తి చేసేందుకు మరో పోరాటానికి సిద్ధం కావాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. రెండున్నర ఏళ్లకే కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయారని ఎన్నికలు వస్తే తగు రీతిలో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని బిఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, నాయకులు కర్నాటి కృష్ణ, మగ్బూల్, ఖమర్, బత్తుల మురళి, బిచ్చాల తిరుమల రావు, కొల్లు పద్మ, తాజుద్దీన్, ముత్యాల వెంకటప్పారావు, పగడాల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మేడే వేడుకలను జయప్రదం చేయండి

**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మేడే వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ పిలుపు నిచ్చారు. సోమవారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం సిపిఐ కార్యాలయంలో 14, 15 డివిజన్లలో కార్యవర్గ సమావేశం జంగాల వలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పగడాల మల్లేష్ మాట్లాడుతూ మే ఒకటిన శుక్రవారం జరిగే మేడే వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. 14, 15 డివిజన్లలోని అర్హులైన పేదలకు ఇండ్ల స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం శాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు ముద్రబోయిన అప్పారావు, బుడిగె వెంకన్న, పగడాల వెంకటేశ్వర్లు, కొత్తగూడెం శాఖ సహాయ కార్యదర్శి మాకబోయిన నాగేశ్వరరావు, వాకదాని వలరాజు, పి. ప్రసాద్, చాగంటి వెంకటనర్సయ్య, ఎస్కె రజబ్ అలీ, పోతురాజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమించాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** చికాగో అమరవీరులు చిందించిన రక్తం ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను, 8గంటల పని దినాన్ని అమలు చేయాలని పనికి తగిన ప్రతిఫలం ఇవ్వాలని, పెట్టుబడిదారుల శ్రమదోపిడికి వ్యతిరేకంగా పోరాడిన రోజే మేడే 1886 సంవత్సరంలో మే 1న శ్రామిక వర్గం కార్మిక వర్గ పోరాటాల దినంగా పాటించాలని టియుసిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్.లాల్మియా పిలుపునిచ్చారు. సోమవారం తల్లాడ పట్టణంలో 140వ మేడే గోడపత్రిక ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడే కార్మిక నాయకులు త్యాగాలతో రక్తంతో తడిసిన జెండా ఎర్రజెండని సుత్తి కొడవలి జెండాని ఆకార్మిక జెండా పోరాట ఫలితమే ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కులను సాధించుకోవటం జరిగిందని తెలిపారు. నరేంద్రమోడీ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికవర్గం మేడే అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని, తల్లాడ పట్టణంలో విస్తృతంగా మేడే కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందులో కార్మిక వర్గం అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో టియుసిఐ తల్లాడ బ్రాంచ్ కమిటీ నాయకులు వెంకన్న, నరసరావు, రమణ, రాంబాబు, శ్రీను, బడే మియా, రామారావు, నరేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో రెపరెపలాడిన గులాబీ జెండా



**ప్రజాపక్షం/చింతకాని :** బీఆర్ఎస్ సాధించిన ఉద్యమ ప్రస్థానాన్ని మననం చేసుకునే సందర్భంలో చింతకాని మండలంలో ఊరువాడ ఏకమై జెండా పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. గాంధీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు మాట్లాడుతూ కేసిఆర్ నాయకత్వంలో తెలంగాణను దేశంలో మొదటి స్థానంలో నిలిపారన్నారు. తెలంగాణ ప్రజలంతా తిరిగి కేసిఆర్ పాలన కోసం ఎదురుచేస్తున్నారన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో మండలంలో తిరిగి గులాబి జెండా ఎగురవేస్తామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, సహకార సంఘం డైరక్టర్లు నన్నక కోటయ్య, రైతు సంఘం నాయకులు మంకెన రమేష్, గద్దం శ్రీను, వంకాయపాటి సత్యనారాయణ, వంకాయపాటి వెంకట లచ్చయ్య, పిన్నెల్లి శ్రీనివాస్, మదార్, పూర్ణయ్య, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుల నిరసన



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని గంగదేవిపాడు సొసైటీ పరిధిలో గల రైతల వరి ధాన్యాన్ని ఇప్పటికీ కొనుగోలు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం ఐక్యంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. గత 20రోజులుగా ఎండనక, వాననక కష్టపడి వరిధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు కేంద్రం వద్ద రాశులు పోసుకుని ఎదురు చూస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితమే కొనుగోలు కేంద్రం ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈసందర్భంగా రైతులందరూ కలిసి తహశీల్దార్‌కి వినతపత్రం సమర్పించి తమ సమస్యలను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే వరి ధాన్యం కొనుగోలు చేయాలని వేడుకున్నారు. ఈకార్యక్రమంలో భాజపా కిసాన్ మోర్చా నాయకులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, చల్ల నరేష్, అయినాల రామలింగేశ్వరారవు, కళ్యాణపు కృష్ణయ్య, నల్లమోతు మోహన్‌రావు, రైతు సంఘం నాయకులు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఫెర్టిలైజర్స్ దుకాణాలు బంద్



**ప్రజాపక్షం/చింతకాని :** తెలంగాణ రాష్ట్ర ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోషియేన్ పిలుపు మేరకు చింతకాని మండల వ్యాప్తంగా ఫెర్టిలైజర్స్ దుకాణాలు సోమవారం మూతపడ్డాయి. ఈ సందర్భంగా చింతకాని మండల అసోషియేషన్ అధ్యక్షుడు ఉప్పుగండ్ల రవి మాట్లాడుతూ ఎరువుల కంపెనీలు మందు కట్టలకు లింకులు పెడుతూ డీలర్ల పై , పరోక్షంగా రైతులపై అదనపు భారం పడుతుందని దీంతో విక్రయాలు ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మందా గోపాల్, అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం, మొక్కజొన్నల కొనుగోలులో ప్రభుత్వం విఫలం

**-మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి**



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంట కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని మాటలు చెబుతున్నారే తప్పా ఆచరణలో తీవ్రమైన ఆలస్యం జరుగుతుందని అన్నారు. సోమవారం మధిర వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం రైతులను కలిసి మాట్లాడి పరిస్థితులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గ కేంద్రంలో ధాన్యం రైతులు తమ పంటను ఆరబోసి వారాలు గడుస్తున్న ఇంతవరకు ఒక్క గింజను కూడా కొనుగోలు చేయలేదని, రోజు వారి మారుతున్న వాతావరణ పరిస్థితులు దృష్ట్యా వ్యవసాయ మార్కెట్‌లో పడిగాపులు కాయటం జరుగుతుందని తెలిపారు. గన్ని బ్యాగులు ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు కాటా వేస్తారో, ఎప్పుడు లోడ్లను తరలిస్తారో ఎప్పుడు పంట డబ్బులు తమ అకౌంట్లో జమ అయితాయో అంతా అయోమయంగా ఉందని అన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం పనితీరు ఇంత నిర్లక్ష్యంగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి చెప్పనక్కరలేదని అన్నారు. పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నప్పటికీ ఇంత వరకు కొనుగోలు మాత్రం చేయటం లేదన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన బస్తాల సంఖ్య కంటే ఎక్కువగా పండించిన రైతులు తమ పంటను ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, రైతులు పండించి ప్రతిగింజను కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మాజీ జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, పార్టీ డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, కిలారి సురేష్, మండవ ఫణీంద్రకుమారి, రైతులు పాల్గొన్నారు.

# బంకుల్లో డీజిల్, పెట్రోల్ లేక అవస్థలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న బంకుల్లో డీజిల్, పెట్రోల్ లేక మండల వ్యాప్తంగా ఉన్న బంకుల్లో రైతులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని చెన్నూరు, పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, కల్లూరు, తదితర గ్రామాల్లో ఉన్న బంకుల్లో వాహనదారులు రైతులు తీవ్ర ఇబ్బందులు గత మూడు రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు .వరి కోత మిషన్ దారులు, ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు, పలు రకాల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గత మూడు రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఒక బంక్ లోకి డీజిల్ పెట్రోల్ వచ్చినా కూడా గంటలో అయిపోతుంది. సమస్యను పరిష్కరించాలని అధికారులను వాహనదారులు కోరుతున్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు




**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ 26వ ఆవిర్భావ వేడుకలు సందర్భంగా మాజీ జెడ్పి చైర్మన్, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ.. కేసిఆర్ తెలంగాణ కోసం ఒక్కడు బయలుదేరి తెలంగాణలోని సబ్బండ వర్గాలను కలుపుకుని తెలంగాణను తీసుకువచ్చి రాష్ట్రాన్ని 10 సంవత్సరాల పాటు అభివృద్ధి పథంలో నడిపారని కేసిఆర్ తెలంగాణ కోసం బయలుదేరిన సమయంలో పుట్టిన వారు ఇప్పుడు యువకులుగా ఉన్నారని, వారికి తెలంగాణ చరిత్ర తెలంగాణ పుట్టుక చెప్పాల్సిన ఆవశ్యకత ఎంతో ఉన్నదని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం పాటుపడుతున్న బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ సహకారాన్ని అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో పట్టణ, అధ్యక్ష, కార్యదర్శులు పల్లపోతు వెంకటేశ్వరరావు, అరిగె శ్రీనివాసరావు, 19వ వార్డు కౌన్సిలర్ యన్నంశెట్టి అప్పారావు, చిత్తారు నాగేశ్వరరావు, బిక్కి కృష్ణప్రసాద్, దీరావత్ మాధవి, ఆళ్ల నాగబాబు, పరిస శ్రీనివాసరావు, చీదిరాల రాంబాబు, వేల్పుల శివ, మార్త అప్పారావు, బత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఆశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. జె. హేమంత కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కొత్తూరు రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ప్రారంభమైంది.ఉద్యాన శాఖ హెడ్ డా. ఐ.వి. శ్రీనివాస రెడ్డి రసాయనాల వాడకం వల్ల కలిగే నష్టాలు, ఆయిల్ పామ్ సాగు, మార్కెటింగ్ అంశాలను వివరించారు. డా. జంబమ్మ సేంద్రియ సాగు, యాంత్రీకరణ ప్రాధాన్యతను తెలిపారు. డి. స్రవంతి మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగుపై సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఏడీఏ వి. శ్రీనివాస్ రెడ్డి, ఎంఏఓ వై. శ్రీనివాస్ రావు, ఉద్యాన అధికారి జి. శ్రావణి, సర్పంచ్ ఇనంపూడి శ్రీనివాస్ రావు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

# పోరాటాల్లో మధుసూధన్‌రావుది చెరగని ముద్ర




## సిపిఎం పోలిట్ బ్యూరోసభ్యులు రాఘవులు

ప్రజాపక్షం/కొణిజర్ల : ప్రజలతో మమేకమై అలుపెరగని ప్రజాఉద్యమాలు నడిపిన సంక్రాంతి మధుసూధన్‌రావు పోరాటాల్లో చెరదగని ముద్ర వేసుకున్నాడని సిపిఎం పోలిట్‌బ్యూరోసభ్యులు బివిరాఘవులు, విజ్జుకృష్ణన్, సిపిఎం కేంద్రకమిటి సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు సంక్రాంత్రి మధుసూధన్‌రావు ప్రథమవర్ధంతికార్యక్రమం సంక్రాంత్రి పురుషోత్తమరావు అధ్యక్షతన మండల పరిదిలోని లాలాపురంలో సోమవారం జరిగింది. తొలుత నాయకులు సంక్రాంత్రి మధుసూధన్‌రావు చిత్రపటానికి పూలు వేసి నివాళులుర్పించారు. ఈ వర్ధంతి సభలో వారు మాట్లాడుతు పార్టీని ర్మాణం, అభివృద్దిలో మధుసూధన్‌రావు ఎనలేని కృషిచేశాడని కొనియాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు కేద్రాలద్వారా కొనడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులకు సరిపోను గన్నీసంచులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఓవైపు కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కాకపోవడం మరోవైపు అకాల వర్షాలు వస్తాయనే ఆందోళనలో రైతులు ఉన్నారని కాంటాలు వేసిన మక్కలు సరఫరా చేయడానికి సరైన సమయంలో లారీలు రాకపోవడంతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఉండాల్సి వస్తోందని అన్నారు. కేంద్రంలో బిజేపి మతోన్మాదం, నియంతృత్వ పోకడలు అవలంబిస్తోందని అన్నారు. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత వలన పంటల చేతికి వచ్చే సమయం కనుక మొక్కజొన్న కోసే యంత్రాలు డీజిల్ లేక పండిన పంట పొలాల్లోనే నిలిచిపోతుందని వెంటనే పెట్రోల్, డీజిల్ కొరత ను నియంత్రించాల్సిన అవసరం ప్రభుత్వనికి ఉందని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ వంటి చిన్న దేశాన్ని నలిపేస్తాం అనడం హేయమైన చర్యఅని అన్నారు. కమ్యూనిస్టు దేశాలను నాశనం చేయాలని ట్రంప్ చూస్తున్నాడని అది ఆయన తరం కాదని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పై వ్యతిరేకత మొదలైందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరుగ్యారింటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### మధుసూధన్‌రావు చిరస్మరణీయుడు : నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి

సంక్రాంత్రి మధుసూధన్‌రావు నిత్యం ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేసి ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయుడుగా నిలిచాడని కొనియాడారు. మధుసూధన్‌రావుతో తనకు ఎంతో విడదీయరాని బంధం ఉందని పార్టీలు వేరైనా ఆయనతో ఎంతో సన్నిహితంగా ఉండేవాడినని తెలిపారు. పార్టీలో ఆయన ఎంతో క్రమశిక్షణతో మెలిగేవాడని పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కడవరకు కమ్యూనిస్టుపార్టీలో కొనసాగాడని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కాంగ్రేస్‌పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. కాంగ్రేస్‌పార్టీ కమ్యూనిస్టుపార్టీలను ఎప్పుడు చిన్నచూపుచూడలేదని స్పష్టంచేశారు. ఈ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, సోమయ్య, మాచర్ల భారతి, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, మేరుగు సత్యనారాయణ, యర్ర శ్రీనివాసరావు, తాతా భాస్కర్‌రావు, కొప్పుల కృష్ణయ్య, తాళ్లపల్లి కృష్ణ, చెరుకుమల్లి కుటుంబరావు, సుంకర సుధాకర్, కౌన్సిలర్ చింతనిప్పు సులోచన, అనుమోలు రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల పాటు ప్రజలకు సుపరిపాలన అందించిన ముఖ్యమంత్రి కెసిఆర్



ప్రజాపక్షం/ తల్లాడ : తెలంగాణ ఉద్యమ నేతగా తొలి ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు పదేళ్ల సుపరిపాలన అందించారని బిఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా తల్లాడలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మాజీ సిఎం కేసిఆర్ సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదని, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా రైతులకు వరి, మొక్కజొన్న కొనుగోలు లేకపోవడంతో వారు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు, షేక్.కమల్,ఏలూరు రఘు, సంఘసాని శ్రీనివాసరావు, డేగల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం



ప్రజాపక్షం/ తల్లాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు పండించిన మొక్కజొన్న, వరి ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా, తరుగు లేకుండా కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు కళ్యాణపు కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి నూతనకల్ సొసైటీ కార్యాలయానికి తాళాలు వేసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతనకల్ గ్రామంలో ధాన్యం కొనే దిక్కు లేక రోడ్ల మీదనే ఉంచుతూ ఎప్పుడు కొంటారో తెలియక ఆవేదనతో ఉన్న రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదన్నారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తారో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు న్యాయం చేయాలిన డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ధాన్యం కొనుగోలు యాప్స్‌ను దానిలో ఉన్న నిబంధనలను సరిచేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా సకాలంలో రైతుల పండించిన పంటను కొనుగోలు చేసి వారికి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శెట్టిపల్లి లక్ష్మణరావు, కళ్యాణపు వీరయ్య, తెనాలి సత్యం, పునుగుపాటి రమేష్, పొరళ్ళ వీరస్వామి, కళ్యాణపు వెంకటేశ్వరరావు, నాయుడు భాస్కర్‌రావు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు







ప్రజాపక్షం/వైరా: మితిమీరిన వేగంతో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో చికిత్స పొందుతూ ఒకరు చనిపోయిన సంఘటన సోమవారం వైరాలో చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వైరా పాత బస్టాండ్ సెంటర్ కాంగ్రేస్ కార్యాలయం ఎదురుగా వైరా నుండి ఖమ్మం వైపు వెళుతున్న ద్విచక్ర వాహనదారులు మహాలక్ష్మి అమ్మ దేవాలయం నుండి రోడ్డు దాటుతున్న స్కూటీ వ్యక్తిని వేగంగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురిని 108లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వైరా మండలం ముసలిమడుగు గ్రామానికి చెందిన వేల్పుల చందు(16) మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సహకారంతో మృతుని కళ్లను ఖమ్మం ఐ కేర్‌కు దానం చేశారు. వైరా ఎస్టీ కాలనీకి చెందిన బానోతు శ్రీను, తల్లాడ మండలం పాత పినపాక గ్రామానికి చెందిన పునుకొల్లు వివేక్‌కు తీవ్ర గాయాలు కావడంతో వివేక్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాఓతు శ్రీను ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వైరా ఎస్సై పుప్పాల రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పెట్రోల్, డీజిల్ కొరత నివారించండి : దొండపాటి

ప్రజాపక్షం/కొణిజర్ల : పెట్రోల్, డీజిల్ కొరత వలన రైతుల పంటలకు పంటల ధాన్యాల రవాణా సరఫరాకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తక్షణమే పెట్రోల్, డీజిల్ కొరత నివారించాలని రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతు ఒక పక్కన ఎండలతో మరోపక్క పెట్రోల్, డీజిల్ కొరతతో రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్న ప్రభుత్వ పాలకులకు గుణపాఠాలు తప్పవని ఆయన అన్నారు. గ్యాస్ కొరత వలన ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల కేంద్రంలోని బిఆర్ఎస్ మండల కార్యాలయంలో సోమవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మిఠాయిలు పంచారు. ముందుగా బిఆర్ఎస్ మండల పార్టీ మండల కార్యదర్శి అన్నం శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయంలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే విధంగా కేసిఆర్ నాయకత్వంలో 2001వ సంవత్సరం ఏప్రిల్ 27 బిఆర్ఎస్ ఆవిర్భవించిందని అన్నారు. పార్టీ ఏర్పాటు చేసి నేటికి 25 వసంతాలు పూర్తి చేసుకుని 26 సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా పార్టీ నాయకులకు అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, సంక్రాంతి కృష్ణారావు, శ్రీపాలశెట్టి తిరుపతిరావు, బోడిపల్లి మహేష్, మైనార్టీ నాయకులు షేక్.హుస్సేన్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుశీలమ్మ వర్ధంతి సభను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/ బోనకల్ : సిపిఐ సీనియర్ నాయకులు, అమరజీవి తూము ప్రకాశరావు సతీమణి రాయన్నపేట మాజీ సర్పంచ్ తూము సుశీలమ్మ ప్రథమ వర్ధంతి సభను మంగళవారం రాయన్నపేట తూము ప్రకాశరావు భవన్‌లో ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్న సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్ధంతి సభకు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ తదితరులు పాల్గొంటారని, ఈ కార్యక్రమానికి సిపిఐశాఖ కార్యదర్శులు, మండల కార్యవర్గ సభ్యులు, సానుభూతిపరులు, అభిమానులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# మంత్రి నాదెండ్ల మనోహర్‌కు దీవెల పరామర్శ



ప్రజాపక్షం/ తల్లాడ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు ఇటీవల మృతి చెందారు. సోమవారం ఉదయం వైరా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దీవెల కృష్ణయ్య హైద్రాబాద్‌లోని మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు కుమారుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌రావు వారి నివాసంలో పరామర్శించారు. మాజీ ముఖ్యమంత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు జవ్వాజి ఆనందరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రవాణాచార్జి హామీని నెరవేర్చాలి




ప్రజాపక్షం/ తల్లాడ : ఎరువుల ఉత్పత్తిదారుల సరఫరాపై రవాణా చార్జీ హామీని తక్షణమే నెరవేర్చాలని తల్లాడ మండల ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అధ్యక్షులు నంబూరి మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఎరువుల దుకాణదారుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం తల్లాడలో చేపట్టిన బందు సంపూర్ణంగా ముగిసింది. ఈసందర్భంగా పట్టణంలో ర్యాలీ చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల ఉత్పత్తిదారుల సరఫరాపై రవాణా చార్జీ హామీ ఇవ్వాలని, లింకు ప్రొడక్టు లేకుండా ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. బందుకు సహకరించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగళ్ల పుల్లారావు, దగ్గుల నారాయణరెడ్డి, పెస్టిలైజర్స్ యజమానులు పాల్గొన్నారు.

# ఎరువుల సరఫరాలో అన్యాయం



ప్రజాపక్షం/ బోనకల్ : ఎరువుల ఉత్పత్తిదారుల నుంచి సరఫరా అవుతున్న ఎరువులపై రవాణా చార్జీల హామీని తక్షణమే అమలు చేయాలని బోనకల్ ఫెర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ అసోసియేషన్ అధ్యక్షులు చెన్న సుధీర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బోనకల్‌లో నిర్వహించిన బంద్ పూర్తిగా విజయవంతమైంది. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎరువుల కంపెనీలు రవాణాచార్జీల విషయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎరువుల డీలర్లు ఆర్థికంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా చేసే సమయంలో లింక్ ప్రొడక్ట్స్ పేరుతో అనవసరమైన వస్తువులను బలవంతంగా మోపడం అన్యాయమని అన్నారు. ఇలాంటి విధానాలు కొనసాగితే రైతులు, డీలర్లు ఇద్దరు నష్టపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రమణ, రఘు, మందడపు సుధాకర్, మంద వినోద్, దుకాణదారులు పాల్గొన్నారు.

# ఎప్పటికి తెలంగాణా రాష్ట్రానికి కెసిఆర్ శ్రీరామ రక్ష..



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** మండలం కేంద్రంలోని యల్లంకి సత్య నారాయణ నివాసం వద్ద బీఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు యల్లంకి సత్యనారాయణ బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించి అన్ని వర్గాలను ఏకం చేశారని పేర్కొన్నారు. అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ గా నిలిపిన ఘనత కేసీఆర్ కు దక్కుతుందన్నారు. ఇప్పటికీ ఎప్పటికి తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ శ్రీ రామ రక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చాపలమడుగు రామ్మూర్తి, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు యదళపల్లి వీర భద్రం, మాజీ సొసైటీ డైరెక్టర్ భూక్యా జోహార్ లాల్, గుండెపూడి ఉప సర్పంచ్ బాదావత్ నరేష్, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు తాళ్లూరి రామారావు, గుమ్మడి వెంకటేశ్వర్లు, బుడిపూడి ప్రభాకర్ ఇల్లంగి తిరుపతి పోతురాజు రామారావు పురస్తపురవు రామకృష్ణ, బండారి వెంకయ్య, బుడిపూడి ప్రతాప్, పోతురాజు కృష్ణ, ఈసాల వెంకటేష్, ముకేష్ చందు మరియు తదితరులు నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావానికి 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా అన్నపురెడ్డిపల్లి మండల ప్రధాన కేంద్రంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బోయినపల్లి సుధాకర్‌రావు ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని సంబరాలను జరుపుకున్నారు. పార్టీ జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేసి, పటాకులు పేల్చుతూ ఆనందోత్సాహాలతో వేడుకలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అలాగే మండలంలోని పెంట్లం, రాజాపురం, మర్రిగూడెం, అబ్బుగూడెం గ్రామాల్లో కూడా పార్టీ జెండాలను ఎగురవేసి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు కొత్తూరు వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ నాయకులు చల్లా రాంబాబు, పార్టీ నాయకులు పెదగండ్ల పుల్లారావు, భారత రాంబాబు, సర్పంచ్ కారం శివ, లాకవతి వెంకటేశ్వర్లు, వీరబోయిన వెంకటేశ్వర్లు, వేణు, తదితరులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులకు ఘన సన్మాణం



**ప్రజాపక్షం/గుండాల :** కాంగ్రెస్ పార్టీ జిల్లాస్థాయిలో నూతనంగా పదవి బాధ్యతలను చేపట్టిన జిల్లా ఉపాధ్యక్షునిగా పొంబోయిన ముత్తయ్య, జిల్లా కార్యదర్శిగా ఎస్కే ఖదీర్ లకు సోమవారం పార్టీలకు అతీతంగా వారిని ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సన్మాణ గ్రహీతలు మాట్లాడుతూ పార్టీ నాయకత్వం మాపై నమ్మకాన్ని వమ్ముచేయకుండా,మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పాయంవెంకటేశ్వర్లు , తోట దేవి ప్రసన్నసహాయ సహకారాలతో మండల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. సిపిఐ పార్టీ నాయకులు వాగబోఇన రమేష్, ఎమ్మార్పిఎస్ నాయకులు బొమ్మెర్ల రాంబాబు, నాగేష్, ఆర్యవైశ్యసంఘ మండల అధ్యక్షులు మానాల వెంకన్న, బత్తిని సాయన్న, నాగరాజు మహిమూద్, షాబీర్, తిరుపతి ఉన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీనాయకులు అబ్దుల్‌నబి, ఖాసీం, పూకె బుచ్చయ్య, రాజేష్, భరత్, నరెందర్, పుష్పరాజు, జానకి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బీఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవాన్ని బూర్గంపాడు మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని గులాబీ జెండాలను ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. బూర్గంపాడు మండలం లక్ష్మీ పురం గ్రామ పంచాయితీలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు నిర్వహించి కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే మోరంపల్లి బంజర్ గ్రామ పంచాయితీలో కూడా ఇదే తరహాలో వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో లక్ష్మీ పురం ఉప సర్పంచ్ యారం పున్నరెడ్డి, మోరంపల్లిబంజర్ ఉప సర్పంచ్ పొక్కుల రవి, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సారపాక టౌన్ నాయకులు, ఐటిసి బిఆర్ఎస్‌యు యూనియన్ నాయకులు, యువజన, మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కూసుమంచి:** భారత రాష్ట్ర సమితి ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని రాజుపేట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ కూడలి వద్ద ఏర్పాటు చేసిన జెండా గద్దెపై పార్టీ జెండాను గ్రామశాఖ అధ్యక్షులు సోలిపురం ప్రభాకర్ రెడ్డి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆవిష్కరించారు. రాజుపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ బానోత్ మహేష్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సోలిపురం ప్రభాకర్‌రెడ్డి, మాజీ డిసి అధ్యక్షులు వాసంశెట్టి వెంకటేశ్వర్లు, షేక్ జానీ మియా, రాజుల రాములు, తిన్నారా మహేష్, బానోత్ దేశిరామ్, అబ్బనపురి నరసింహాచారి, షేక్ షరీపుద్దీన్, తుమ్మల శ్రీను, వన్నాపురం వెంకన్న, సాయినీ వీరయ్య, బైరిశెట్టి వెంకటేశ్వర్లు, బానోత్ సేటర్ నాయక్, షేక్ జానీ, సంద్ర వెంకన్న, కిన్నెర నర్సయ్య, సబ్బు సైదులు, తుమ్మల వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## మళ్లీ అధికారమే లక్ష్యం

**-కారేపల్లిలో బీఆర్ఎస్ శ్రేణుల ధీమా**



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల కేంద్రం కారేపల్లి బస్టాండ్ సెంటర్ గులాబీ రంగులో మెరిసింది. భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా సాగింది. వేడుకల సందర్భంగా ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఉద్యమ నాయకుడు సోమందుల నాగరాజు చేతుల మీదుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఉద్యమ నాయకుడు లకావత్ రాము నాయక్, మాజీ జెడ్పిటిసిలు జగన్ నాయక్, ఉన్నం వీరేందర్, మాజీ వైస్ ఎంపీపీ రావుల శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యాల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ హచ్చు, రాందాస్, ఉద్యమ నాయకులు భూక్యా చందు నాయక్, గంగరబోయిన సత్యం, మణికొండ నాగేశ్వరరావు, తాత వెంకన్న, భగవాన్ నాయక్, పిల్లి వెంకటేశ్వర్లు, రాచపంటి రామకృష్ణ, జాల సాంబ, గంగరబోయిన మురళి, గుగులోత్ జుంకీలాల్, పాల్గొన్నారు.

## రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే జాదే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట మండలం తిరుమలకుంట గ్రామంలో సోమవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, తిరుమలకుంట సర్పంచ్ కె.రాజేష్, రెడ్డిగూడెం సర్పంచ్ వెంకట్ రమణ, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు పి.రామలక్ష్మయ్య, ఎంపిడిఓ బి.అప్పారావు, అగ్రికల్చర్ ఎడి రవికుమార్, ఎఓ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లిలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు అంతోటి అచ్చయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జెండాను ఎగరవేసి స్వీట్లు పంచిపెట్టారు. అదే విధంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అస్మిర రాజు, కన్నమాల రాంబాబు, చందు, మంద్రు పుల్లయ్య, ఎస్‌కే బాష, గండమాల రమేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆళ్లపల్లిలో బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం మిన్నంటాయి. వివిధ గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. మర్కోడు బొడ్రాయి సెంటర్ వద్ద మాజీ జెడ్పిటిసి కొమరం హనుమంతరావు జెండా ఆవిష్కరణ చేవారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించిన పార్టీగా, రాష్ట్ర అభివృద్ధిలో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై పోరాడుతామని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు పాయం నరసింహారావు, మాజీ పిఏసిఎస్ ఛైర్మర్ గొగ్గేల రామయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి రాంబాబు, వార్డు మెంబర్ వెంకట కృష్ణంరాజు, కొమరం సతీష్, నాయకులు ములసయ్య, నరేష్, సమ్మయ్య, కోటేష్, అంజయ్య, కనకాచారి, సతీష్, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## కరకగూడెంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక నియోజక వర్గ మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు ఆదేశాను సారంపార్టీ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకొని 26 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా సోమవారం పార్టీ జండాను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అక్కిరెడ్డి వెంకటరెడ్డి, కొమరం రాంబాబు, ఏళ్ళు రామకృష్ణ రెడ్డి, రావుల కనకయ్య, వట్టం వెంకటేశ్వర్లు, ఎస్డీ ఫజల్, కట్టుకోజుల వేణు, సర్పంచ్ లు కొమరం సత్యనారాయణ, వట్టం సందీప్, మాజీ సర్పంచ్ పాయం నరసింహారావు, చిట్టీమల్ల ప్రవీణ్, యాగ్గడి శ్రీను, గాందేర్ల సతీష్, ఎస్డీ ఘయస్, ఊకె అప్పారావు, పోలె బోయిన మల్లయ్య పాల్గొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు మాజీ ఎంఎల్ఏ వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కెక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు.పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సంధర్భంగా వనమా మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో బిఆర్ఎస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి కేసిఆర్‌ను ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. అందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, బిఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులుమంతపురి రాజుగౌడ్, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామమూర్తి, నాయకులు కనగాల బాలక్రిష్ణ, మల్లెల రవిచంద్ర, కాల్వ ప్రకాష్, దాసరి నాగేశ్వరరావు, కార్పోరేటర్‌లు బత్తుల మధుచంద్, సింధు తపస్వి, గోవాడ గుణచరిత్, గుగులోత్ రాంబాబు, మహిళా నాయకులు భట్టు మంజుల, ముత్యాల ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గుండాలలో ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/గుండాల :** బిఆర్ఎస్ పార్టి జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాలమేరకు తెల్లం భాస్కర్ అధ్యక్షతన సోమవారం బిఆర్ఎస్ పార్టి ఆవిర్భావ వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ పందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలను దోచుకునే ప్రభుత్వం వచ్చిందని , ప్రజలు ఇప్పుడు ఆ పార్టీని నమ్మే స్థిలో లేరన్నారు. ప్పుడు ఏ ఎన్నికలు వచ్చిన గులాబి జెండాను గెలిపించి కెసిఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలనే సంకల్పంతో ప్రజలు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మోకాళ్ళ వీరస్వామి, డా.రాము, గడ్డం వీరన్న, సదాకర్, రాంబాబు, తాటి పాపరావు, పవన్, బిరవి, బుచ్చిరాములు, బిసతీష్,పద్మారావు పాల్గొన్నారు.

## అశ్వాపురంలో ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ ఎంఎల్ఏ రేగా కాంతారావు సూచనల ప్రకారం మండల అధ్యక్షులు కోడి అమరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, సీనియర్ నాయకులు కందుల కృష్ణార్జునరావు, నక్కనబోయిన పాపారావు, చిలక వెంకటరామయ్య, భూక్య చందూలాల్, చుంచు రామ్మూర్తి, యువజన విభాగం అధ్యక్షులు గద్దాల రామకృష్ణ, సర్పంచులు లకావత్ రామారావు, మంద్రు రామకృష్ణ, కొంద్రు సోమయ్య, మల్లెలమడుగు ఉప సర్పంచ్ గాడిద మహేష్, అలాగే పలువురు యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా నిలపాలి

**మౌలిక వసతుల కల్పన - అభివృద్ధి పనులకు కలెక్టర్‌తో కలిసి మంత్రి తుమ్మల శంకుస్థాపన**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పరిశుభ్ర నగరంగా ఖమ్మంను ఆదర్శంగా నిలిపేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజలకు మెరుగైన జీవన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సోమవారం ఖమ్మం కార్పోరేషన్ 16వ డివిజన్ ధంసలాపురంలో రూ. 1.20 కోట్లతో నూతనంగా చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం నగరానికి విస్తృతంగా రహదారుల ఏర్పాటుతో పాటు సరిపడ త్రాగునీటి సరఫరా, 24 గంటలు నిరంతర విద్యుత్ అందించి పరిశుభ్రమైన నగరంగా ఖమ్మంను తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో ఇతర కార్పోరేషన్లకు ఖమ్మంను ఆదర్శంగా నిలపాలని అందుకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. పెండింగ్‌లోఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు





చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖమ్మం నగరానికి చుట్టు పక్కల పలు నేషనల్ హైవేలో అందుబాటులోకి వచ్చాయని రింగు రోడ్డు కూడా ఏర్పాటు కానుందని త్వరలో నగరానికి ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నారని ప్రజల అభ్యర్థన మేరకు అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నారని వాటి అమలుకు అధికారులుగా వేగవంతం చేస్తామన్నారు. అనంతరం ధంసలాపురం వద్ద ఖమ్మం దేవరపల్లి నేషనల్ హైవేపై మున్నేరు రైల్వే బ్రిడ్జి వద్ద వంతెన, ఖమ్మంకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల పనులను మంత్రి , కలెక్టర్ పరిశీలించారు. పనులు వేగవంతంగా చేపట్టి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపుకలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొణిజర్ల గ్రామానికి చెందిన సిహెచ్ రామ లక్ష్మ ణులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కొణిజర్ల గ్రామ పంచాయతీ పాలక వర్గంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఏన్కూరు గ్రామ ప్రజలు తమ గ్రామ పరిధిలో గల చెరువు క్రింద వరి పొలాలు కలిగిన రైతులు వర్షం వచ్చినప్పుడు చెరువు నిండి నాలుగు అడుగుల వరకు పొలాల్లో నీరు నిలిచి పంట నష్టపోతున్నామని ఏన్కూరు నుండి గార్లొడ్డు వరకు కొత్తగా పోసే రోడ్డుకు నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న దగ్గర మోరీలు కట్టాలని, రోడ్డు పక్కన కాలువలు తీయాలని దరఖాస్తు చేశారు. కొణిజర్ల మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షులు రెడ్డబోయిన వెంకన్న గ్రామంలో ఉన్నటువంటి ఊరచెరువు, చీకటి చెరువులు కబ్జాకు గురవుతున్నాయని వీటిని సంరక్షించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. మధిర ఎస్సి కాలనీ ప్రజలు ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రి, పిహెచ్సి సబ్ సెంటర్‌ను కొత్త బిల్డింగ్ నుంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పాత భవనానికి షిఫ్ట చేయాలని దరఖాస్తు చేశారు. సంబంధిత దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి

**-సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** చిమ్మపుడి గ్రామంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి గృహప్రవేశాలు చేయించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు చింతల రమేష్ మాట్లాడుతూ చిమ్మపుడి గ్రామంలో 2018లో 55 డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించారని అవి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు నెలల క్రితం లబ్దిదారులకు ఇండ్లు కేటాయించి పట్టాలు ఇచ్చారని కానీ అక్కడ మౌలిక వసతులు కల్పించలేదన్నారు. విద్యుత్ సౌకర్యం, త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సదుపాయాలు లేక లబ్దిదారులు గృహప్రవేశాలు చేసుకోదని అద్దె ఇండ్లలోనే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇట్టి సమస్యపై మంత్రి చెప్పిన అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు దృష్టిసారించి డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి గృహప్రవేశాలు చేయించాలన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వెంటనే



డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వద్ద సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉల్లిబోయిన విష్ణుమూర్తి, నాయకులు చంద్రమ్మ, లబ్దిదారులు షేక్ తుఫాన్ లాల్, వాడపల్లి రమేష్, జింకల రవి, ముద్రబోయిన గోపి, సర్వేశ్వరరావు, ఓబుల సుజాత, వాణి, రజియా, పి. సుగుణ, జల్లి సరస్వతి, వాడపల్లి సరస్వతి, వాడపల్లి సునీత, నాగమణి, జింకల మమత, నారపోగు కల్పన, సంగపోంగు అనూష, అశ్వని, శ్రావణి, సచ్చు సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టు మధుసూదన్ మృతిపట్ల ఐజెయు సంతాపం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సీనియర్ జర్నలిస్టు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పిఆర్‌వో మారబోయిన మధుసూదన్ మృతి పట్ల టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర, జిల్లా కమిటీలు తీవ్ర సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశాయి. సీనియర్ జర్నలిస్టుగా మధు పాత్రికేయ రంగంలో ఎంతో నిబద్ధతతో పనిచేశారని ఆయన మృతితో పాత్రికేయ లోకం ప్రజా సమస్యల పట్ల అవగాహన కలిగిన పాత్రికేయున్ని కోల్పోయిందన్నారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) నల్లగొండ జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేశారని యూనియన్ పట్ల అంకిత భావంతో పని చేస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఐజెయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె. విరాహత్ అలీ,కె. రాంనారాయణ, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, ఖమ్మం జిల్లా యూనియన్ బాధ్యులు నలజాల వెంకట్రావు, మాటేటి వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు భూపాల్, మహేందర్, హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, చారి తదితరులు ఉన్నారు.



# కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా దివాకర టిఎస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దివాకర టిఎస్ ఖమ్మంజిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకర టిఎస్‌ను అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, డిఆర్‌వో పద్మశ్రీ, ఆర్డివో శ్రీనివాస్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, వివిధ సెక్షన్ల పర్యవేక్షకులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

**-నూతన కలెక్టర్‌ను కలిసిన ఐజెయు బృందం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సోమవారం బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ దివాకర ను టియుడబ్ల్యూజె (ఐజెయు) కోరింది. మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిసిన ఐజెయు బృందం జర్నలిస్టుల అక్రెడిషన్లు, నివాస స్థలాలు ఇతర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చింది. ఖమ్మంజిల్లా రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకున్నదని ఇక్కడి జర్నలిస్టు సమాజం అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తుందని యూనియన్ నేతలు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ జర్నలిస్టుల సూచనలు, సలహాలను తీసుకుంటామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, జిల్లా నాయకులు వనం వెంకటేశ్వర్లు, తాళ్లూరి మురళీకృష్ణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, జనార్ధానాచారి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం, జిల్లా ఉపాధ్యక్షులు మోహినుద్దీన్, సత్యనారాయణ, గోపాల్, సురేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని రఘునాథపాలెం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సోమవారం భారత రాష్ట్ర సమితి రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గ్రామ గ్రామాన బిఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. 25 ఏళ్ల క్రితం కేసిఆర్ తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేశారని నాయకులు కొనియాడారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి కేసిఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశారని తెలిపారు. మరల రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# మధుసూదన్ మృతిపట్ల సిపిఐ సంతాపం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సీనియర్ జర్నలిస్టు, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క పిఆర్‌వో మారబోయిన మధుసూదన్ మృతిపట్ల సిపిఐ జిల్లా సమితి తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఆంధ్రజ్యోతి పత్రికలో ఖమ్మం జిల్లా బాధ్యులుగా పనిచేసిన మధు ప్రజా ఉద్యమాలకు సహకరించారని ఉద్యమ వార్తలకు ప్రాధాన్యతనిచ్చారని సిపిఐ జిల్లా సమితి తెలిపింది. మధుసూదన్ మృతితో ఒక నిబద్ధత కలిగిన పాత్రికేయున్ని కోల్పోయామని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# ఘనంగా బిఆర్ఎస్ పార్టీ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలంగాణ తల్లికి పూలమాలలు వేసి జై తెలంగాణ నినాదాలు చేశారు. పార్టీ జెండాను పట్టణ అధ్యక్షులు ఆవిష్కరించారు. రాబోయే కాలంలో పార్టీకి మరిన్ని విజయాలు చేకూరి మరల కేసిఆర్ ముఖ్యమంత్రి అవ్వాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మహిళా నాయకులు, మండల సీనియర్ నాయకులు, యువ నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు పాల్గొన్నారు.